

తెలంగాణ చౌక్‌లో భోగిమంటల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణరావు

ఘనంగా భోగి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 14: మూడు రోజుల ముచ్చటైన పండుగ సంక్రాంతిలో భాగంగా ఆదివారం తొలి రోజు భోగి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే లేచి భోగి మంటలు వేసుకొని మంగళ స్నానాలాచరించి దైవ దర్శనం చేశారు. కొందరు సాయంత్రం భోగి మంటలు కాల్చారు. మరో వైపు మహిళలు తమ వాకిళ్లలో అందమైన ముగ్గులు వేశారు. పిండి వంటలు తయారు చేసుకొని విందులు ఆరగించారు. బంధువులతో గృహాల్లో సందడి నెలకొంది. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోసి అక్కడక్కడా బొమ్మల కొలువు నిర్వహించారు. మహిళలు, యువతులు, ముత్తైదువులను ఆహ్వానించి నోములు, పసుపు, కుంకుమలు వాయినాలుగా పంచుకున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోగిమంటలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు హాజరై మాట్లాడుతూ జాగృతి ఆధ్వర్యంలో సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే రీతిలో సామాజిక సేవలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు గందె కల్పన, జిల్లా కోశాధికారి అత్తె రాజారాం, జిల్లా పీఆర్‌వో గాలిపెల్లి రత్నాకర్, యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉయ్యాల విష్ణువర్ధన్, విద్యార్థి విభాగం కో కన్వీనర్ సత్తు సంతోష్ తదితరులు పాల్గొన్నారు. మంకమ్మతోటలో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు.

● నేడు సంక్రాంతి పర్వదినం

సోమవారం మకర సంక్రాంతి వేడుకలు జరుపుకోనున్నారు. మకర సంక్రమణం లక్ష్మీదేవి ఆగమనానికి సంకేతంగా చెబుతారు. శ్రీమన్నారాయణునితో కలిసి లక్ష్మీదేవి రంగుల ముగ్గుల రథాన్ని ఎక్కి వస్తుందంటారు. అందుకే ముగ్గులకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. అలాగే ధాన్యరూపంలో ఉన్న లక్ష్మీదేవితో పాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇళ్లకు వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని మహిళలు అలికి ముగ్గులు పెట్టి పసుపుకుంకుమలతో గడపను అలంకరిస్తారు. గొబ్బెమ్మలను తయారు చేసి కూరపిండి, నువ్వులు, రేగు పండ్లు ముగ్గుల్లో ఉంచుతారు. ఇంటిని రంగవల్లులతో, మామిడితోరణాలు, పూలతో అలంకరించుకుంటారు.



కట్టరాంపూర్ శాతవాహన రెసిడెన్సీలో భోగి వేడుకలు

కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు

● ఎంపీ ఎన్నికల తర్వాత ఎప్పుడైనా ప్రభుత్వం కూలే ప్రమాదం

● బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్, జనవరి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్‌కు కోవర్టులు ఉన్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో మానకొండూకర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విలేకరులతో బండి సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కేసీఆర్ పెద్ద ఎత్తున స్కెచ్ వేస్తున్నాడన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నాడన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న కోవర్టులో కేసీఆర్ బేరసారాలు చేస్తున్నాడన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో ఉన్న కేసీఆర్ కోవర్టులకు పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేశారన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలే ప్రమాదముందన్నారు. కాంగ్రెస్‌లో కేసీఆర్‌కు కోవర్టులున్నారన్నారు. గత ఎన్నికల్లో వాళ్లకు పెద్ద ఎత్తున డబ్బులిచ్చా రన్నారు. బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కేసీఆర్ కుట్రలు చేస్తుంటే గమనించడం లేదన్నారు. రాష్ట్ర ప్రజల బతుకులను సర్వనాశనం చేసిన బీఆర్ఎస్‌ను పూర్తిగా బొందపెట్టేదాకా విశ్రమించబోమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అయితే ఇతర రాష్ట్రాల్లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాలోనే ఆ పార్టీకి అభ్యర్థులు లేరన్నారు. తెలంగాణలో ఎక్కువ మంది ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు అధిక నిధులు వస్తాయన్నారు. యాదాద్రి అక్షింతలు పంచితే అధికారంలోకి వచ్చే వాళ్లమని కేటీఆర్ అంటున్నాడని, పంచొద్దని ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు. భద్రాద్రిరామాలయానికి తలంబ్రాలు తీసుకురానోడు, వేములవాడ రాజన్నకు, కొండగట్టుకు, ధర్మపురి ఆలయాలకు డబ్బులు ఇస్తానని మోసం చేసిన మీకు హిందువుల గురించి, బీజేపీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజలు కేసీఆర్‌ను మర్చిపోయారని, బయటకు వస్తే పట్టించుకునేదెవరని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే కేంద్రంలో బీజేపీ ఎంపీలు గెలువాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు కలిసి పనిచేస్తే రాష్ట్రానికి అత్యధిక నిధులు తీసుకు వచ్చే అవకాశం ఉందన్నారు. రామమందిర పునఃప్రతిష్ఠకార్యక్రమం బీజేపీది కాదని, సాధుసంతువులు సూచించిన మంచిమహూర్తం ప్రకారమే చేస్తారన్నారు. ఇది రాజకీయాలకతీతంగా జరిగే కార్యక్రమమన్నారు. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని తిట్టడం మాని కేంద్రాన్ని ఒప్పించి అధిక నిధులు తీసుకురావడానికి కృషి చేద్దామన్నారు. మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

జమ్మికుంట, జనవరి 14: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బర్పటి రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని మాయమాటలు చెబుతూ ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిటా ఎర వేస్తూ మోసం చేస్తున్నారన్నారు. జమ్మికుంటకు చెందిన ఓ బాధితుడికి ఇండియన్ బుల్స్ అనే కంపెనీ నుంచి రూ.లక్ష లోన్ సాంక్షన్ అయినట్లు సైబర్ నేరగాడు ఫేక్‌లెటర్ సృష్టించి పంపించడం జరిగిందన్నారు. అది చూసి నిజం అని భావించిన వ్యక్తి నుంచి డిపాజిట్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పేరిట రూ.25వేలు లాగాడని తెలిపారు. బాధితుడు మళ్లీ ఫోన్ చేయగా సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందని, దీంతో మోసపోయినట్లు గుర్తించి పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇలాం టి సంఘటనలు జరిగిన సమయంలో వెంటనే 1930నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వైభవంగా గోదారంగనాథ కల్యాణం




ఇల్లందకుంటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 14: నగరంలోని పలు ఆలయాల్లో గోదారంగనాథ కల్యాణాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాలను తిలకించి పులకించి పోయారు. తిరుమలనగర్ శ్రీనిలయంలో మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో గోదారంగనాథ కల్యాణాన్ని నిర్వహించారు. బోగ శ్రీనివాస్, దేవనపల్లి రమేశ్, కట్ట వాణిశ్రీ అన్నమాచార్య కీర్తనలు ఆలపించాయి. పలు ప్రాంతాల భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. విద్యానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వానమామలై పవన్‌కుమారాచార్యుల ఆధ్వ ర్యంలో జరిగిన కల్యాణంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్య దర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య, కామ అంజిబాబు, సింగిరెడ్డి రాంరెడ్డి, ఉప కార్యదర్శులు గడప సత్యనారాయణ, గడ్డం గోపాల్, రుద్రోజు ఉత్తమాచారి, కోశాధికారి జూలూరు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో అర్చకులు వీచర నరసింహాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఈఓ నాగారపు శ్రీనివాస్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● సీతారామచంద్రస్వామి ఆలయంలో...

ఇల్లందకుంట: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీగోదారంగనాయకుల (అండాల్) కల్యాణ మహోత్సవ కార్యక్రమం వేదబ్రహ్మ ణుల మంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదారంగనాయకుల కల్యాణం కొరకు ఆలయ ఈవో కందుల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు ఉదయం నిత్యవిధి, అనంతరం అమ్మవారి కల్యాణ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈవో సుధాకర్, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించగా, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకణాల శ్రీలత-సురేందర్‌రెడ్డి, సిబ్బంది మోహన్, రాజయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ రాధిక - కాప్రా
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR ప్రెస్టన్‌మాల్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
PVR ఎస్2 నోమ - మల్లాపూర్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	మూవీటైమ్ - అమీర్‌పేట
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మంత్రామాల్- అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ	జె.పి.సినిమాస్ - చందానగర్

సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో

పుస్తకాల బహూకరణ



హైదరాబాద్‌లో ఆకర్షణకు పుస్తకాలు అందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, జనవరి 14: హైదరాబాద్‌కు చెందిన ఆకర్షణ సతీష్‌కు ఆదివారం సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పిల్లల సాహితీ పుస్తకాలను బహూకరించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆకర్షణ సతీష్ ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో పదికి పైగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీలతో సత్కారాలను పొందారు. ఆమెను ప్రోత్సహించేందుకు మానేరు రచయితల సంఘం (మారసం) వ్యవస్థాపకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ వెయ్యి పిల్లల పుస్తకాలను అందించేందుకు సంకల్పించి బాల సాహిత్య పరిషత్ చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్యసభ అబ్దుల్‌గనీలు మరికొన్ని పుస్తకాలు సమకూర్చగా వాటిని కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మారసం నిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, బాలసాహిత్య పరిషత్ అధ్యక్షుడు చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్య సభ కన్వీనర్ డాక్టర్ ఎస్‌కె అబ్దుల్‌గనీ పాల్గొన్నారు.

19 నుంచి జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 14: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21తేదీల్లో జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో అండర్-1600 ఫిడే రేటింగ్ కలిగిన చదరంగ క్రీడాకారులకు ఈ పోటీలను అఖిల భారత స్థాయిలో నిర్వహించనున్నామని పోటీల నిర్వహణ కమిటి సభ్యులు బి రమణారావు, అంతగిరి రాజేంద్రప్రసాద్, చెరుకు ప్రద్యుమ్నకుమార్, రాజభాను, ఎ విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి చదరంగ పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారి అని వివరించారు. ఈ పోటీలకు అంతర్జాతీయ సమాఖ్య, అల్ ఇండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు ఉందన్నారు. చెస్ పోటీలను 9 రౌండ్లలో స్విస్, లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నామని చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులకు రెండు లక్షల రూపాయల నగదు బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఓపెన్ కెటగిరిలో 20 నగదు బహుమతులు, అండర్-1,200, అండర్-1,400 రేటింగ్ కేటగిరిలో 10 నగదు బహుమతులను, అన్ రేటెడ్ క్రీడాకారులకు 5, వెటరన్ విభాగంలో 5 నగదు బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు బాల, బాలికలకు అండర్-9, 11, 13, 15 విభాగాలలో పోటీలను నిర్వహించి, నగదు బహుమతులతోపాటు ప్రత్యేక బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 17లోపు తమ ఎంట్రీలను 9030177607నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి 'ఖని' ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్



దినేష్

కోల్‌సిటీటౌన్, జనవరి 14: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేది నుంచి 20వ తేది వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కళ్యాణం దినేష్ ఎంపికయ్యాడు. ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న దినేష్ ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగే శిబిరంలో పాల్గొంటాడు. దేశంలోని 12 రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనే శిబిరంలో కళాశాల నుంచి దినేష్ పాల్గొనడం విశేషం. కాగా కళాశాల చెందిన విద్యార్థి జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, అధ్యాపకులు సురేష్‌కుమార్, రవి, సావిత్రి, అజయ్, యాదయ్య, సల్మాసుల్తానా, అజీజ్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వై.ప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ అభినందించారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

కోల్‌సిటీ, జనవరి 14: నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ రెమరాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గాలిపటాలు ఎగురవేసే క్రమంలో పక్షులతో పాటు సాధారణ ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయని చెప్పారు. దీంతో చైనా మాంజాను రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986ప్రకారం మాంజా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని, ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించనున్నామని తెలిపారు. చైనా మాంజా విక్రయించే దుకాణాలపై తనిఖీలు ఉంటాయని తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ శ్రీచరణ్, దేవయ్య

సిరిసిల్ల రూరల్, జనవరి 14: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలో ఆదివారం కుక్కలు స్వైర్య విహారం చేసి గ్రామస్థులపై దాడులు చేయడంతో ముగ్గురు గాయాలకు గురయ్యారు. గ్రామానికిచెందిన మూడు సంవత్సరాల శ్రీచరణ్ అనే బాలుడితో పాటు గీతా కార్మికుడైన వంగ దేవయ్య గౌడ్, దానవేని ఎల్లవ్వలు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వెంటనే గాయపడ్డ వారిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాలిపటం ఎగురవేస్తూ గాయపడిన బాలుడు

కొడిమ్యాల, జనవరి 14: మండలంలోని బొల్లోని చెరువు గ్రామానికి చెందిన చెల్ల రిషిత్ అనే 11 ఏళ్ల బాలుడు ఆదివారం గాలిపటం ఎగురవేస్తుండగా వెనుకకు నడుస్తూ కిందపడి గాయపడ్డాడు. చేతికి బలమైన గాయమైంది. గాయపడిన బాలుడిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మణ్ రెడ్డి, మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 14: గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సీతారాం అనే ప్రైవేట్ లెక్చరర్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 3తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సీతారాం కుటుంబ సభ్యులతో ఈ నెల 1వ తేదిన హైదరాబాద్‌కు వెళ్లాడు. గేట్‌కు తాళం వేసి ఉండడంతో ఇంట్లో చొరబడిన దొంగలు ఇంట్లోని ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి, జనవరి 14: మేడిపల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కాచారం గ్రామానికి చెందిన కొప్పెర మోహన్‌రెడ్డి (54) అను వ్యక్తి ఏపీ 15 బీసీ 6561 గల హెచ్ఎఫ్ డీలక్స్ పై పెట్రోల్ పంపు వైపు రోడ్డు దాటుతుండగా జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వెలుతున్న కారు ఏపీ 25 ఏ ఎల్ 0477 నెంబర్ గల కారు ఢీకొట్టి, రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో మోహన్ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

నిందితుడి అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్

సిరిసిల్ల క్రైం, జనవరి 14: గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామానికి చెందిన అంబటి శ్రీకాంత్(35) అనే నిందితుడిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆదివారం సిరిసిల్లలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇతను ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిట్ల వెంకటేశ్‌కు చెందిన ఇంటికి ఈనెల 11న అర్ధరాత్రి వెళ్లి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని ఏడు తులాల బంగారు అభరణాలు, 12 తులాల వెండి అభరణాలు, రూ. 45 వేలు ఎత్తుకెళ్లాడని తెలిపారు. ఈ సంఘటనపై ముస్తాబాద్ ఎస్ఐ కె. శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి ఆధునిక సాంకేతికత , సీసీ కెమెరాల ఆధారంగా 24గంటల్లో చోరీచేసిన దొంగను చేధించి పట్టుకున్నారన్నారు. నిందితుడు శ్రీకాంత్‌ను పట్టుకొని విచారించగా చోరీచేసినట్లు అంగీకరించాడ ని, ఇతని వద్ద రూ. 31వేల నగదు, పల్సర్ బైక్, దొంగిలించిన సొమ్మును స్వాధీనం పరుచుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

చెప్పుల దుకాణం దగ్ధం


దగ్ధమవుతున్న దుకాణం

మల్యాల, జనవరి 14: దిగువ కొండగట్టులో గల చెప్పుల దుకాణం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. శంకర్‌కు చెందిన చెప్పుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగగా స్థానికులు మంటలు ఆర్పివేశారు. దుకాణంలోని మూడు లక్షల రూపాయలకు పైగా విలువైన చెప్పులు కాలి బూడిద అయ్యాయి. కాగా డబ్బాలో గల రూ.1.50లక్షల నగదు సురక్షితంగా ఉండగా మంటలను ఆర్పివేసిన అనంతరం వాటిని బయటకు తీశారు.

రాజకీయాల కోసం దేవుడినీ వదలడం లేదు

● ప్రశ్నించిన వారిపై హిందూ వ్యతిరేకులుగా ముద్ర ● రాముడు కొందరి వాడు కాదు.. అందరివాడు ● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/కరీంనగర్ అర్బన్, జనవరి 14: రాజకీయ లబ్ధి కోసం, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు దేవుడిని కూడా వదలడం లేదని, అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు కూడా దేవాలయాలు ప్రారంభోత్సవం చేయరని, విగ్రహ ప్రతిష్ఠ, శిలాన్యాస కార్యక్రమాలు పాలకుల చేతుల మీదుగా కాకుండా పీఠాధిపతుల చేతుల మీదుగా చేస్తారని గుర్తు చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదని జగద్గురువులు చెబుతున్న విషయాన్ని ప్రతీ ఒక్కరు గమనించాలన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకున్నా, ప్రారంభోత్సవానికి సరైన సమయం కాకున్నా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల దృష్టి మళ్లించి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఈ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. వీటన్నింటినీ ప్రశ్నించిన తమపై హిందువులకు వ్యతిరేకమనే ముద్ర వేస్తున్నారని, హిందుత్వాన్ని విశ్వసించే వారు ఈ పరిణామాలపై ఆలోచన చేయాలని, దేవుడు కొందరి వాడు కాదు అందరి వాడని, కులం, ధనం, అధికారం పదవులతో సంబంధం లేకుండా రాముడు, శివుడు, హన్మంతుడిని ప్రతీ ఒక్కరూ కొలుస్తారని అన్నారు. పార్లమెంటులో అదానీ, అంబానీకి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక రాముడిని ముందుకు తీసుకువచ్చి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మండల్ కమిషన్‌తో పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని, కమండల్ కమిషన్‌తో వాళ్ల ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

● రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి..

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలు బాగుండాలని రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధిపై తదుపరి చర్యల కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని, మహాశివరాత్రి కంటే ముందే ఈనెల 30వ తేదీలోగా వీటీడీఏ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజరాజేశ్వర స్వామివారి భక్తులుగా ఆలయ అభివృద్ధి బాధ్యత తమపై ఉందని, ఎవరూ ప్రశ్నించకముందే వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కరీంనగర్‌లో జర్నలిస్టులతో చిట్‌చాట్ అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుకు మంగళసూత్రాలు అమ్ముకున్నానని చెప్పిన బండి సంజయ్ ఐదేళ్లలో ఏ ఊరులో చూసినా లక్షల రూపాయల పెద్దపెద్ద కట్‌అవుట్స్ పెట్టుకుంటున్నాడని, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయన్నారు. కరీంనగర్ లోక్‌సభ సీటు కాంగ్రెస్ గెలుచుకుంటుందని, గత ఎన్నికల్లో మతంపేరిట, ఆస్కార్ అవార్డు తరహాలో నటన చేశాడు కాబట్టి గెలిచాడని, ఈసారి అలా కానివ్వమన్నారు. జిల్లాకు ప్రస్తుత ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీలు వినోద్‌కుమార్, కేసీఆర్‌లు ఏ పథకాలు, ఏ మేర నిధులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రైల్వేలైన్, మోడల్‌స్కూల్, పాస్‌పోర్ట్ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయం, ఎఫ్‌ఎం రేడియో, ఎలగందుల టూరిజం వంటివి పథకాలను, నిధులను తీసుకవచ్చానని, దీనిపై చర్చకు సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ప్రస్తుత ఎంపీ ఐదేళ్లలో చేసిన ఒక్క పని చెప్పమనండి అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ దేశాభివృద్ధికి కూడబెట్టిన కేంద్ర సంస్థలను బీజేపీ ప్రభుత్వం అమ్ముతోందని అన్నారు. కేటీఆర్‌కు అధికారం పోయిన బాధలో ఉన్నాడని, పదవిలో నుంచి దిగిపోతారని ఎప్పుడూ కలలో కూడా ఊహించలేదని అందుకే అసహనంలో ఉన్నాడన్నారు.

రాజన్న సేవలో మంత్రి పొన్నం

వేములవాడ, జనవరి 14: రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని, కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అర్చకులు వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజన్న ఆలయం ముందు ఆయనకు ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి పొన్నంకు స్థానిక ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూస రవీందర్ సంగీతం శ్రీనివాస్, తూమ్ మధు, పాత సత్యలక్ష్మి, పులి రాంబాబు, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.


కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వీరభద్రనామస్మరణతో మార్మోగిన కొత్తకొండ

● జాతరలో భక్తుల కిటకిట
● గుమ్మడికాయలు, కోరమీసాలు చెల్లించుకున్న భక్తులు


జాతరకు వస్తున్న కుమ్మర్ల ఎడ్లబండ్లు


గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న యువతులు

భీమదేవరపల్లి, జనవరి 14: వీరభద్రా... శరభా... శరభా.... అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. భక్తుల వీరభద్రస్వామి నామస్మరణతో పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీ దర్శనం, సర్వ దర్శనం ఇలా అన్ని క్యూలైన్లు భక్తాజనంతో కిక్కిరిసిపోయాయి. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగాయి. పవిత్ర కోనేరులో స్నానాలచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు మూడు నుంచి నాలుగు గంటల పాటు వేచి చూశారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండాదీపంలో నూనె పోశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది జాతరలో పలు సేవలందించారు. ఆలయ ఈవో కిషన్‌రావు జాతరకు పాలకవర్గ కమిటీ లేకపోవడంతో అన్ని తానై ఏర్పాట్లను పర్యవేక్షించాడు. సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు జాతరకు వచ్చి స్వామివారికి గుమ్మడికాయ మొక్కులు, కోరమీసాల మొక్కులు చెల్లించారు.

భోగి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు...

బోగి పండుగను పురస్కరించుకొని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్యయంత్ర ప్రతిష్ఠాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం నిత్య బలిహరణ, అమ్మరికి శ్రీచక్రార్చన, నవావరణ పూజ చండీహోమం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని నందీశ్వర పూజలు చేశారు.

కుమ్మరుల బోనాలతో ప్రారంభమైన ఎడ్లబండ్లు...

ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలలో కుమ్మరులు బోనాలను వండి తమ ఎడ్లబండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాతరోజు నుంచి ఎడ్లబండ్ల కార్య క్రమం జరగడం ఆనవాయితీగా వస్తుంది. దీంట్లో భాగంగా కుమ్మరులు ఆదివారం సాయంత్రం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటుంకుండతో నృత్యాలు చేశారు. వీటివెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగండ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

మోదీ పాలనలో ఆర్థిక తిరోగమనం

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

జగిత్యాల టౌన్, జనవరి 14: మోదీ పాలనలో భారతదేశం ఆర్థిక తిరోగమనంలోకి వెళ్లిందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ జోడో న్యాయ యాత్ర పోస్టర్లను, వాల్ స్టిక్కర్లను నాయకులతో కలిసి జీవన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం ఆర్థికంగా తిరోగమనం చెందడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరించిందన్నారు. ప్రతీ పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షల వేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం కనీసం 15 రూపాయలు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రతీ పేదవాడికి న్యాయం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ యాత్రను ప్రజలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమటాల శ్రీనివాస్, గుండ మధు తదితరులు ఉన్నారు.

రాయికల్ టు అయోధ్య

- సైకిల్ యాత్రకు బయలుదేరిన యువకులు


అయోధ్యకు సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న యువకులు

రాయికల్, జనవరి 14: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామచంద్ర ప్రభువు విగ్రహ రూపంలో ప్రాణప్రతిష్ఠ కానుండటంతో రాయికల్‌కు చెందిన యువకులు గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ రాయికల్ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్రను చేపట్టారు. రాయికల్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్య వరకు సైకిల్ యాత్రతో బయలుదేరారు. రామమందిరం నిర్మాణమైతే రాయికల్ నుంచి సైకిల్ యాత్ర నిర్వహిస్తామని మొక్కుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ యాత్ర సుమారు 1150 కిలో మీటర్లు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరాముని భగవాధ్వజాన్ని ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, రాకేష్ నాయక్, శ్రీరామ తీర్థ క్షేత్ర సమితి బాధ్యులు తురగ రాజరెడ్డి, కాయితి గంగాధర్, వేల్పుల స్వామి యాదవ్, దొంగ జితేందర్ రెడ్డి, బొమ్మకంటి రాంగోపాల్ జీ, బొడుగం మోహన్ రెడ్డి, గాజెంగి అశోక్, కుర్మ మల్లారెడ్డి, తోపారపు రవీందర్, గన్నవరం గంగాధర్, వాసం జలంధర్, మామిడాల లక్ష్మీనారాయణ, శ్రీగద్దె సుమన్ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణం

వేములవాడ, జనవరి 14 : శ్రీరంగనాయకస్వామి, గోదాదేవిల దివ్య కల్యాణం వేములవాడలో ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చకులు, వేదపండితుల బృందం రంగనాయకస్వామి, గోదాదేవిల ఉత్సవమూర్తులను స్వామివారి కల్యాణ మంటపంలో అందంగా అలంకరించి వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హరిహరనాథ్, ఆలయ సిబ్బంది, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

● కొండగట్టులో..

మల్యాల: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకించి అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణలు మధ్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు వైభవంగా జరిపారు. కల్యాణానికి ఆలయ అధికారులు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. కల్యాణం సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటేష్, ఫౌండర్‌ట్రస్టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, సునీల్ ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సంపత్, లక్ష్మారెడ్డి అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ, కొండగట్టులో గోదారంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యుత్ మోటర్లు దొంగిలించి

ఇనుప సామాను షాపుల్లో విక్రయం?

బీర్‌పూర్, జనవరి 14: పంటపొలాల్లో నీరు పారించడం కోసం రైతులు ఉపయోగించే విద్యుత్ మోటర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు జరుపుతున్న క్రమంలో పొరుగు జిల్లాలోని ఓ మండల కేంద్రంలో పోలీసులు దొంగలను పట్టుకున్నట్లు సమాచారం. అయితే మోటర్లు ఎత్తుకెళ్లి సమీప మండల కేంద్రంలోని ఓ పాత ఇనుప సామాన్లు కొను గోలు చేసే షాపుల్లో విక్రయించినట్లు దొంగలు ఒప్పుకున్నట్లు చర్చ జరుగుతోంది.

మండలంలో రైతులకు నిద్రపట్టకుండా చేసిన దొంగలు దొరికారన్న వార్త తెలియడంతో ఇటీవల జరిగిన దొంగతనాలకు కారకులు వీరేనా అనే చర్చ మండలంలో జరుగుతోంది. నూతన సంవత్సరం రోజున శాంతిస్థూపం సమీపంలో గల కిరాణం షాపునకు అమర్చిన ఇనుప జాలీని కట్ చేసి సామగ్రి దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు సీసీ కెమెరాలు ఉంటే దొంగలు కచ్చితంగా దొరికి ఉండేవారని చర్చించుకుంటున్నారు.

కబడ్డీ... కబడ్డీ

- ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం
- శిక్షణలో జాతీయ, రాష్ట్ర కబడ్డీ క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 14: గ్రామీణ ప్రాంతాల్లోని కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా, మండల స్థాయిలో కబడ్డీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి జట్టులో అవకాశాలు వచ్చే విధంగా ప్రత్యేక శిక్షణలను నిర్వహిస్తూ క్రీడాకారులలో నైపుణ్యానికి పదును పెడుతున్నారు. ఈ నెల 2న సిరిసిల్ల పట్టణంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ బాలబాలికల ఎంపికల పోటీలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాజన్న సిరిసిల్ల జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిపుణులైన కోచ్‌ల ద్వారా బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కబడ్డీ శిక్షణ శిబిరంలో బాలబాలికల జిల్లా జట్లలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు కూడా పాల్గొన్నారు. శిక్షణశిబిరం ద్వారా క్రీడా నైపుణ్యం, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎంపికైన క్రీడాకారులతో పరిచయాలు, స్నేహం వారితో అనుబంధాలను వివరించారు. గత గురువారం మెదక్ జిల్లా గజ్వేల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాలబాలికల జట్లు సిరిసిల్ల నుంచి తరలివెళ్లాయి.


కబడ్డీ బాలబాలికల జట్లతో నాయకులు

టీ షర్ట్స్ పంపిణీ..

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానాంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్లలోని క్రీడాకారులకు టీ షర్ట్స్‌ను అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిందం చక్రపాణి, వైస్ చైర్మన్స్ కోడి అంతయ్య అందజేశారు.

శిక్షణ శిబిరాలు ప్రావీణ్యాన్ని పెంచుతాయి

- ఎండీ సానా, జాతీయ స్థాయి క్రీడాకారిణి



కబడ్డీ శిక్షణ శిబిరాలు క్రీడాకారులలో మరింత ప్రావీణ్యాన్ని పెంచు తాయి. మండల, జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయి టోర్నమెంట్స్ నిర్వహిం చాక ఎంపికైన జట్ల సభ్యులకు ఖచితంగా శిక్షణ శిబిరాలను నిర్వహిం చాలి. శాతవాహన యూనివర్సిటీ నుంచి చెన్నయ్‌లో ఒకసారి కదయ్‌కుడిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నాను. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

ప్రభుత్వం కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలి

- జీ పావని, జాతీయ స్థాయి క్రీడాకారిణి



కబడ్డీ క్రీడను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాలలో క్రీడామైదానాలు లేవు. ఉన్న క్రీడా మైదానాలలో సౌకర్యాలు లేకపోవడంతో నైపుణ్యం ఉన్నా క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. మా వ్యాయామ ఉపాధ్యాయులు, కబడ్డీ అసోసియేషన్, కోచ్‌ల ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చాము. తమిళనాడు మధురైలో జరిగిన కబడ్డీ పోటీలలో శాతవాహన యూనివర్సిటీ నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, ఏడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

ఆర్టీసీ కార్మిక సంఘాలతో త్వరలో సమావేశం

-మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు మల్లేశంగౌడ్

భగత్‌నగర్, జనవరి 14: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మిక సంఘాల ప్రతినిధులతో త్వరలో సమా వేశం ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ప్రతినిధు లతో మాట్లాడారు. యూని యన్ నాయకులు మంత్రికి ఆర్టీసీ పరిస్థితులను వివరిం చారు. ఈ సందర్భంగా స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి) రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జక్కుల మల్లేశం మాట్లాడుతూ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దానికి సంబంధించిన విధి విధానాల కోసం అధికారులతో వేసే కమిటీలో యూనియన్ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు ట్రెజరీల ద్వారా వేతనాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అమలు చేయడంతో పాటు డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి కార్మిక సంఘాలను అనుమతించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించామన్నారు. తమ వినతికి రాష్ట్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆర్టీసీ కార్మిక సంఘాలు, ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కోరా విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 14: నగరంలోని కోరా ఉన్నత పాఠశాలకు చెందిన రాగిని, శ్రీజ, శరణ్య, యోగేశ్వరి, శ్రీహిత ఈనెల 11న జూనియర్స్ విభాగంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి డైరెక్టర్స్ వరప్రసాద్, రాంరెడ్డి, హరిక్రిష్ణ మెమొంటోలతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు పిల్లల్లో మానసిక శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ దుర్గరాజును అభినందించారు. ఈ నెల15 నుంచి 17 వ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు వెళ్లనున్నారని తెలిపారు.

వీధులకు బోర్డులు ఏర్పాటు చేయాలి

భగత్‌నగర్, జనవరి 14: నగరంలోని పూర్వ వీధులకు బోర్డులు ఏర్పాటు చేయాలని చరిత్ర పరిశోధన సమితి కన్వీనర్ డాక్టర్ సి.శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం నగరంలోని పలు వీధుల్లో పర్యటించి నగర వాసులతో మాట్లాడి అధ్యయనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని బోయవాడ, కాపువాడ, కార్ఖానగడ్డ, సిక్‌వాడి, షాషామహల్ వంటి ప్రాంతాలకు ఎంతో చరిత్ర నేపథ్యం ఉందన్నారు. వాటి కూడళ్లలో ఆ ప్రాంతాన్ని గుర్తించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్‌కు పూర్వ వైభవాన్ని చాటే విధంగా కరీంనగర్ వీధుల చరిత్ర అనే పుస్తకం త్వరలో తేనున్నట్లు తెలిపారు.

హాకీ క్రీడాకారులకు దుస్తులు అందజేత

హుజూరాబాద్, జనవరి 14: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో హాకీ క్రీడాకారులకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీటీడీ మాజీ అను సంధాన కర్త దొంత రమేశ్ 10వేల రూపాయలు విలువ చేసి యూనిఫాం, స్టాకింగ్స్ కొనుగోలు చేసి ఇవ్వగా వాటిని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆదివారం క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొలిపాక శ్రీనివాస్, గంగిశెట్టి ఉమామహేశ్వర్, వేముల రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు రాములోరి అక్షింతలు



బోగంపాడులో అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లందకుంట, జనవరి 14: మండలంలోని బోగంపాడు గ్రామంలో ఇంటింటికి శ్రీరామ జన్మభూమి అక్షింతలను బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ మేరకు అయోధ్య నుంచి వచ్చిన (శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు) అక్షింతలు, రామమందిరం ఫొటోలు, తీర్థ క్షేత్ర కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. గ్రామంలో రాముని చిత్రపటంతో ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 22న అయోధ్యలో శ్రీబాలరాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించే సమయంలో ప్రతి ఇంట్లో దీపావళి పండుగలా జరుపుకోవాలని, సాయంత్రం సూర్యుడు అస్తమించిన తర్వాత దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి తది తరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను శంకరప ట్నం మండలంలోని కన్నాపూర్, గద్దపాక గ్రామాల్లోని భక్తులు శ్రీరామ కీర్తనలు, భజనలతో గడప గడపకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా మహిళలు మంగళహారతులతో వారికి స్వాగతం పలికారు. అక్షింతలను స్వీకరించారు. శ్రీరామ పూజిత అక్షింతలు ప్రతి ఇంటికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి చైర్‌పర్సన్ ఎన్నికపై హర్షం



జమ్మికుంటలో స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట రూరల్, జనవరి 14: ఇండియా కూటమి చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఎన్నికల కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి సదయ్య, పొనగంటి రవీందర్, బుర్ర కుమార్, గొట్టె ప్రభుదాస్, లింగారావు, సతీష్‌రెడ్డి, మల్లయ్య, చాంద్ పాషా, శ్రీకాంత్, మల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి ఎమ్మెస్సార్ జయంతి





కరీంనగర్‌లో కేక్ కట్ చేస్తున్న డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జమ్మికుంటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి 14 : తెలంగాణ ఉద్యమ నేత మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు 90వ జయంతి వేడుకలను కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. డీసీసీ కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజ మల్లయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్‌లు హాజరై ఎమ్మెస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెస్సార్ స్వగ్రామమైన వెదిర గ్రామంలో వెన్న రాజ మల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు బొబ్బిలి విక్టర్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థన, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్‌లో కేక్ కటింగ్ చేశారు. యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో కార్ఖానగడ్డ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ గారి ఆధ్వర్యంలో నగరం లోని హౌసింగ్ బోర్డ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో యూత్ సభ్యులు సాజిద్, వాజిద్, సమీర్‌ల ఆధ్వర్యంలో రోగులకు వృద్ధులకు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో నాడు ఇందిరాగాంధీ నుంచి మొదలుకొని నేటి సోనియా గాంధీ వరకు ఆయన పలు కీలకమైన సందర్భాల్లో గాంధీ కుటుంబానికి ముఖ్య సలహాదారుడుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సమద్ నవాబు, పులి ఆంజనేయులుగౌడ్, మడుపు మోహన్, వెన్న రాజమల్లయ్య, అబ్దుల్ రెహమాన్, శ్రావణనాయక్, కొరివి అరుణ్‌కుమార్, కల్వల రామచందర్, బొబ్బిలి విక్టర్, గడ్డం విలాస్‌రెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, వన్నం రజిత, కుర్రపోచయ్య, ఇన్నారెడ్డి, రామిడి రాజిరెడ్డి, ముల్కల యోనా, కవిత, కుంభాల రాజకుమార్, వంగల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● **జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సత్యనారాయణ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి, కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి జన్మదిన వేడుకలను జరిపారు. కార్యక్రమంలో నాయకులు కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, యండి సలీం, యగ్గని శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, సలీంపాషా, యండి ఇమ్రాన్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 14: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టియుటి జిల్లాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్‌రెడ్డి కలిసి ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, బదిలీ అయి రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినాహాయింపు ఇప్పించాలని, 317 జీవో, స్పౌజ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు కేతిరి తిరుపతిరెడ్డి, జయేందర్‌రెడ్డి, చొల్లేటి శ్రీనివాస్, పులిపాక కిషన్, హరికృష్ణ, వరుకోలు నాగరాజు, వినోద్, రాంరెడ్డి, మొగిలి, కాంతయ్య, వేణుగోపాలచారి, మొగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కరీంనగర్ టౌన్, జనవరి 14: తెలంగాణ ఆర్ట్ వర్క్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడిపై పాఠశాల విద్యార్థులకు చిత్ర లేఖ పోటీలను నిర్వహించనున్నట్లు టిఏపీఈటా జిల్లా అధ్య క్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఒక ప్రకట నలో తెలిపారు. అయోధ్యలోని రామ మంది రంలో శ్రీరాములవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహిస్తు న్నామని చెప్పారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు జూనియర్స్, ఆరు నుంచి పదవ తరగతి వరకు సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలను మూడు అంశాల్లో నిర్వహి స్తామని చెప్పారు. రాముడి సుందరమైన చిత్రం, సీతారామలక్ష్మణ సమేత హనుమాన్ చిత్రం, ప్రతిష్ఠించబోయే శ్రీరాములవారి పాదుకల చిత్రం వీటిలో ఏదైనా ఒక అంశాన్ని పోస్టుకార్డుపైగానీ, ఏ-4 సైజు పేపర్లోగాని రంగులతో చిత్రం వేసి, చిత్రాలను ఈనెల 20లోగా టీఏపీఈటా ఉమ్మడి జిల్లా కార్యాలయం, ఇంటినెంబర్ 2-7-146, కళాభారతి ఎదురుగా, బస్టాండ్ పక్కన, కరీంనగర్-505001 అనే చిరునామాకు పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 98493 02904 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'ఎంపీ బండి సంజయ్‌కి అభివృద్ధిపై ధ్యాస లేదు'



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 12: ఎంపీ బండి సంజయ్‌కి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయాలనే ధ్యాస లేదని మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శిం చారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి కేంద్రం నిధులు 155 కోట్లతోనే జరుగుతున్నాయని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా లేదంటూ ఎంపీ బండి సంజయ్ చేసిన వాఖ్యలు పూర్తిగా అవాస్తవమని ఖండించారు.

2014 నుంచి 2018 వరకు ఆనాటి ఎంపీ వినోద్‌కుమార్ అనేక మార్లు తీగలగుట్టపల్లి ఆర్వోబీ వెంటనే మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రైల్వే అధికారులను కోరారన్నారు. వినోద్‌కుమార్ రాసిన లేఖకు స్పంది స్తూ ఆనాటి సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ మేనేజర్ శ్రీనివాస్ తీగలగుంటపల్లి గ్రామపంచాయతీలో లక్ష లోపు జనాభా తక్కువగా ఉన్నందున రైల్వే నిబంధనల మేరకు ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయడం కుదరదని లేఖ రాశారన్నారు. దీంతో ఆనాటి మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్ ఎలాగైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తీగలగుట్టపల్లి గ్రామ పంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయించడంతో రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశారని అన్నారు. బండి సంజయ్ అభివృద్ధి ఏమి చేశామో ప్రజలకు తెలుసునని సునీల్‌రావు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిపై బీజేపీ అసత్య ప్రచారం

కరీంనగర్ టౌన్, జనవరి 14: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఆ పార్టీ నేతలు కరీంనగర్-తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను రాజకీయం చేస్తూ బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఈ బ్రిడ్జికి కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధులు కాకుండా ఇతర నిధులు ఏమైనా ఇస్తే తప్పకుండా కేంద్ర ప్రభుత్వాన్ని, మీ ప్రయత్నాన్ని అభినందించే వాళ్లమని సునీల్‌రావు పేర్కొన్నారు. నిజంగానే నిధులెక్కడి నుంచి ఇచ్చారనే, బ్రిడ్జి రావడానికి కారణమెవరనేది తెలుసుకోవాలని కోరారు.

వైభవంగా శ్రీగోదారంగనాయకుల కల్యాణం



సుందరగిరి వేంకటేశ్వర ఆలయంలో తాళిని చూపుతున్న అర్చకులు

జమ్మికుంట, జనవరి 14: పట్టణంలోని వేంకటాద్రినగర్‌లో గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథస్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదారంగనా యకుల కల్యాణం కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మహా అన్నదా నం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా తదిత రులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో వేంకటేశ్వరస్వామి ఆలయం లో గోదారంగానాయకుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. అనం తరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గండె సంపత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత, ధర్మకర్తలు గుండె కారి మాధవ్ , బొల్ల బత్తిని మహేశ్, తాళ్ల పెల్లి కిరణ్, శ్రీమూర్తి, మంతెన మహేందర్, బొల్లం వెంకటలక్ష్మి, తిరుపతిరెడ్డి, తల్లాపెల్లి రాజయ్య, చిట్టంపల్లి నారాయణ, విద్యాన్‌రెడ్డి, మంగ, దాసరి శ్రీనివాస్, శ్రీరామోజ్‌కుమార్, బుచ్చి నర్సిం గ్‌రావు, అశోక్‌రావు, నర్సింహాచార్యులు, నవి కృష్ణ, చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



తీగలగుట్టపల్లిలో శ్రీగోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో, కేశవపట్నంలోని జీఆర్ స్వామి మఠంలో ధనుర్మాసోత్సవాల్లో భా గంగా ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం అర్చకులు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అలంకరించి, అభిషేకం చేశారు. కార్యక్రమంలో పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: నగరంలోని తీగలగుట్టపల్లి శ్రీకోదండరామాలయంలో శ్రీ గోదారంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో చివరి రోజు (భోగిపండుగ)ను పురస్కరించుకుని మంగళ వాయిద్యాల మధ్య వేదపండితుల మంత్రోచ్చారణలతో శ్రీ గోదారంగనాథుల కల్యాణం నిర్వహిం ఆరు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, అర్చకులు శ్రీనివాస్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఇల్లందకుంట, జనవరి 14: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ న్యాయ యాత్ర విజయ వంతం కావాలని మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న భారత్ జూడో న్యాయ యాత్ర మణిపూర్ రాష్ట్రం తౌబోల్ నుంచి ముంబై వరకు 66 రోజుల పాటు కొనసా గుతుందన్నారు. కార్యక్రమంలో ఆకుల రాములు, రాజేశం, సంతోష్, శ్రీరా మ్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

మానకొండూర్, జనవరి 14 : మండలంలోని ఊటూ ర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రకాష్ స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్రికెట్ పోటీల్లో విజేతగా శ్రీరాములపల్లి, రన్నరప్‌గా ప్రగతిమిత్ర జట్లు నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచు ఎనగందుల సుదర్శన్, ఉపస ర్పంచు రేమిడి శ్రీనివాస్, ఎంపీటీసీ గోపు మమత, క్రీడా కారులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు



కన్నాపూర్‌లో భోగి మంట వేసిన మహిళలు

హుజూరాబాద్, జన వరి 14: హుజూరాబాద్ లో భోగి వేడుకలను ప్రజ లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, రేగుపళ్లు, నవధా న్యాలు, గరికలతో అలంకరించా రు. పండుగను పురస్క రించుకొని ప్రజ లు పెద్ద ఎత్తున పిండి వంటలను తయారు చేసుకున్నారు.

శంకరపట్నం: మండ ల వ్యాప్తంగా భోగి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి మహి ళలు యువకులు, రైతులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాల్లో భక్తులతో రద్దీ నెలకొంది.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలో భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. మహిళలు ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెడుతూ సందడి చేశారు. పిల్లలు పతంగులు ఎగుర వేశారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

వీణవంక, జనవరి 14: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బెల్టుషాప్ నిర్వాహిస్తున్న పంజాల కుమార్‌పై కేసు నమెదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. పక్కా సమాచారం మేరకు షాప్‌లో తనిఖీ చేయగా 5,300 రూపాయల విలువ గల మద్యం సీసాలు లభ్యమయి నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరయినా బెల్టుషాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని ఎస్సై హెచ్చరించారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జనవరి 14: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన మద్దిమల్ల తరుణ్‌ను అదే గ్రామానికి చెందిన కొయ్యాడ సిద్ధార్థ్ బూతులు తిడుతు గాయపరిచాడని చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. తరుణ్ పాఠశాల ఆవరణలో ఉండగా అకారణంగా ముక్కుపై కడెంతో దాడి చేయగా గాయమైందని బాధితుడు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, జనవరి 14: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మూల సతీష్(39) తాటి చెట్టు పైనుంచి పడటంతో గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కింద పడిపోయాడు. వెంటనే సతీష్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కుడి కాలు మడమ విరిగినట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు.

బీజేపీలో చేరిన ఎంపీటీసీ

గన్నేరువరం, జనవరి 14: ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీ నామా చేసిన మండలంలోని ఖాసింపేట ఎంపీటీసీ ఏలేటి స్వప్న చంద్రారెడ్డి ఆదివారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సమక్షంలో గ్రామానికి చెందిన 300మంది కార్యకర్తలతో ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, నాయ కులు సాయిని మల్లేశం, సొల్లు అజయ్‌వర్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

జమ్మికుంట రూరల్, జనవరి 14: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలు కోసం కార్యాచరణ రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. వంద రోజుల్లోపు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి అభినందన



సంపత్‌రెడ్డిని అభినందిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, జనవరి14: శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో కంప్యూటర సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ సంపత్‌రెడ్డికి జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా పొందడంతో ఆదివారం విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డితో పాటు సిబ్బంది అభినందించారు. సెక్యూర్ ఎనర్జీ ఎఫిషియెంట్ రూటింగ్ టెక్నిక్స్ ఫర్ లార్జ్‌స్కేలు వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ అంశంలో గైడ్ ప్రొఫెసర్ జి నర్సింహా పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ పట్టా పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు, విభాగాధిపతి కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

గంగాధర, జనవరి 14: గంగాధర వీరభద్రస్వామి కల్యాణం సందర్భంగా ఆదివారం వేదపండితుల మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం సందర్భంగా రుద్రాభిషేకం, నిత్యహోమం, గణపతిపూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రతేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తుల కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ వైద భూపతి, నాయకులు సత్యనారాయణ, పురమల్ల మనోహర్, బుచ్చయ్య తది తరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కోట్ల వీరభద్రుడి ఉత్సవాలు

గంగాధర, జనవరి14: గంగాధర మండలం కోట్ల నర్సింహుల పల్లి వీరభద్రస్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గంగా జలసే కరణ, ధ్వజ శోభాయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వ హించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట కవితా మల్లారె డ్డి, ఎంపీటీసీ శంకరమ్మబుచ్చయ్య, పాల్గొన్నారు.

ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సంక్రాంతి శుభాకాంక్షలు

కరీంనగర్ అర్బన్, జనవరి 14: బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాక్షలు తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని పేర్కొన్నారు.

'బీసీ సంక్షేమ శాఖలో అవినీతిపై విచారణ చేపట్టాలి'

గణేశ్‌నగర్, జనవరి 14 : గత ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమ శాఖలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని వాటిపై వెంటనే విచారణ జరిపించి బీసీ సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పూర్తిస్థాయి కమిషనర్ లేక చాలా సంవత్సరాలు కమిషనర్ కార్యాలయంలోని జేడీ స్థాయి అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి బీసీ సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించారన్నారు. పెద్దపల్లి సహాయ సంక్షేమ శాఖ అధికారి మంచిర్యాల జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారని తెలిపారు.

రాష్ట్రస్థాయి కార్యా లయంలోని అధికారులు తమ ఇష్టానుసారంగా డిప్యూటేషన్ ఇచ్చుకుంటూ సంక్షేమ శాఖను అవినీతి శాఖగా మార్చారని ఆరోపించారు. ఆ అధికారి ఇటు పెద్దపల్లి జిల్లాకు న్యాయం చేయకుండా అటు మంచిర్యాల జిల్లాకు న్యాయం చేయకుండా బీసీల సమస్యలు పట్టించు కోలేదన్నారు. ఇలా అధికారులపై విచారణ చర్య లేకపోయే సరికి వారు జరిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు బీసీ సంక్షేమ శాఖకు పూర్తిస్థాయి కమిషనర్ను నియమించి గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని బీసీ సంఘాల పక్షాన కోరుతున్నామన్నారు.